క్లుప్తంగా

చెక్కు అందజేత

కైలాస్‌నగర్: కాగజ్‌నగర్ మండలం ఈజ్‌గాం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి సురేశ్ మండల్ ఇటీవల మరణించారు. దీంతో సైనిక సంక్షేమ శాఖ ద్వారా ఆర్థిక సహాయం కింద రూ.2 లక్షల చెక్కు మంజూరైంది. కాగా.. సోమవారం జిల్లా సైనిక సంక్షేమ అధికారి వెంకటేశ్వర్లు ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో మృతుడి భార్య తపోసికి చెక్కు అందజేశారు. సైనికులతో పాటు రిటైర్డ్ సైనికులకు అన్ని విధాలా అండగా ఉంటామన్నారు.

జాతర విజయవంతం చేయండి

తిర్యాణి: మండలంలోని గడలపెల్లి గ్రామపంచాయతీ పాముస్‌మడుగు పుణ్యక్షేత్రంలో ఈనెల 7న నిర్వహించే పాహుండి కుపార్ లింగో జాతరను విజయవంతం చేయాలని జాతర నిర్వహణ కమిటీ అధ్యక్షుడు మడావి గుణవంత్‌రావు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడుతూ జాతరకు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో ఆదివాసీలు తరలిరావాలన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

తిర్యాణి: మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మి గణపతి ఆలయ ఏడవ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కుంకుమ పూజతోపాటు, భక్తులకు అన్నదానం చేశారు.

సెమిస్టర్ పరీక్షలు వాయిదా

కాగజ్‌నగర్‌రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి నిర్వహించే డిగ్రీ రెండో సంవత్సరం (మూడో సెమిస్టర్) పరీక్షలు వాయిదా వేసినట్లు ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ తూడూరు దత్తాత్రేయ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి పరీక్షలను మార్చి 5న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ఈనెల 26 నుంచి నిర్వహించే డిగ్రీ మూడో సంవత్సరం (ఐదో సెమిస్టర్) పరీక్షలు యథావిధిగా నిర్వహిస్తామన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ దరఖాస్తుల ఆహ్వానం

రెబ్బెన: మండలంలో అర్హత, ఆసక్తి గల అభ్యర్థుల నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కోఆర్డినేటర్లు విజయరాణి, అనీస్ అహ్మద్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్, మే నెలల్లో జరుగనున్న పరీక్షల కోసం ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 12 నుంచి 21 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రూ.25 జరిమానాతో 22వ తేదీ నుంచి 27వ తేదీ వరకు, రూ.50 జరిమానాతో 28 నుంచి మార్చి 4వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మోడల్ టెస్ట్ పేపర్ ఆవిష్కరణ

కాగజ్‌నగర్‌రూరల్: అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏఐఎస్‌బీ) ఆధ్వర్యంలో సోమవారం కాగజ్‌నగర్ పట్టణంలో పదో తరగతి మోడల్ టెస్ట్ పేపర్‌ను ఆవిష్కరించారు. జిల్లా నాయకులు రాజు మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షలకు 10వ తరగతి విద్యార్థులను సిద్ధం చేసేందుకు ఏఐఎస్‌బీ మోడల్ పరీక్ష నిర్వహిస్తుందన్నారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దివ్యాంగ పిల్లలకు ఉపకరణాల పంపిణీ

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని జీడిచేను మండల పరిషత్ పాఠశాలలో సోమవారం దివ్యాంగ పిల్లలకు ఉపకరణాలను ఎంఈవో భిక్షపతి పంపిణీ చేశారు. ఒక వీల్‌చైర్, ఒక రోలేటర్, రెండు ఈయరింగ్ హెడ్స్‌లను అందజేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అనురాధాబాయి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సమత, ఐఈఆర్‌పీ సతీశ్, సీఆర్‌పీ అర్జున్ పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని భట్‌పల్లి గ్రామంలో నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనులను ఎంపీడీవో, ప్రత్యేక అధికారి సత్యనారాయణ గౌడ్ సోమవారం పరిశీలించారు. గ్రామం నుంచి చేలకు వెళ్లే మార్గంలో రోడ్డు నిర్మిస్తుండగా ఆయన పరిశీలించారు. గ్రామంలో మురికి గుంతలు ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

సమ్మె నోటీసు అందజేత

కాగజ్‌నగర్‌రూరల్: ఈనెల 16న నిర్వహించే దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్ సమ్మె నోటీసును సోమవారం రైల్వే స్టేషన్‌మాస్టర్, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ కైలాస్‌కు తెలంగాణ రైల్వే క్యాజువల్, కాంట్రాక్టు, ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో రైల్వే కాంట్రాక్టు క్యాజువల్ హమాలీ కార్మికులు సమ్మె నోటీసు ఇచ్చారు. ఈసందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముంజం ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ సామాన్య ప్రజల హక్కులపై దాడి చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు యూసుఫ్ పాల్గొన్నారు.

‘వేటా’డేస్తున్నారు..!

పచ్చని చెట్లు.. పారేటి సెలయేళ్ల మధ్య దొరికింది తింటూ హాయిగా జీవనం సాగించే వన్యప్రాణులకు గడ్డుకాలం వచ్చింది. జిల్లాలో వేటగాళ్లు రెచ్చిపోతుండడంతో వన్యప్రాణుల ఉనికి ప్రశ్నార్థకంగా మారుతోంది. వేటగాళ్ల ఉచ్చులతో వాటికి రక్షణ లేకుండా పోతోంది. అటవీ అధికారులు పలుమార్లు వేటగాళ్లను పట్టుకుంటున్నా పరిస్థితిలో మాత్రం మార్పు రావడం లేదు.



సిర్పూర్(టి)లో చుక్కల దుప్పిని చంపిన వేటగాళ్లతో అధికారులు (ఫైల్)

- జిల్లాలో వన్యప్రాణులకు రక్షణ కరువు
- కొన్నేళ్లుగా పదుల సంఖ్యలో హతం
- వేటగాళ్లపై కానరని కఠిన చర్యలు

కౌటాల: వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు ఉంటాయని చెబుతున్న వన్యప్రాణుల రక్షణ చట్టం కాగితాలకే పరిమితమవుతోంది. వేటగాళ్లు దర్జాగా ఉచ్చులు, విషపు గుళికలు పెట్టి రకరకాల జంతువులతో పాటు పక్షులను సైతం వేటాడి చంపుతున్నారు. కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని కౌటాల, బెజ్జూర్, చింతలమానెపల్లి, దహెగాం, పెంచికల్‌పేట్, కాగజ్‌నగర్ మండలాలతో పాటు తిర్యాణి, రెబ్బెన, వాంకిడి, కెరమెరి, లింగపూర్ మండలాల్లో పెద్ద ఎత్తున అడవి విస్తరించి ఉంది. ఇక్కడ కుందేళ్లు, దుప్పులు, జింకలు, పులులు, పక్షులు ఇతర వన్యప్రాణులు అధిక సంఖ్యలో ఉన్నాయి. వాటి రక్షణకు వేటగాళ్ల రూపంలో ముప్పు పొంచి ఉంది. ఇటీవల పెద్ద పులుల మృతి కలకలం రేపిన విషయం తెలిసిందే. వారం రోజుల క్రితం సిర్పూర్(టి)లో చుక్కల దుప్పిని వేటాడి తరలిస్తుండగా ముగ్గురిని అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు.

అడ్డుకట్టేది..?

కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో ఇటీవల కే15, ఎస్9 పెద్ద పులుల వరుస మృతి సంఘటనలు రాష్ట్రంలోనే సంచలనం రేపాయి. జాతీయ జంతువు, అంతరించిపోతున్న జాబితాలో ఉన్న పెద్ద పులులకే రక్షణ లేకపోవడంతో జంతు ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అడవులను రక్షించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అటవీశాఖ అధికారులకు ఆధునాతన వాహనాలను సమకూర్చింది. అయినా అడవులు, వన్యప్రాణుల రక్షణ ప్రశ్నార్థకంగా మారింది. అడవి జంతువులు, పులుల సంరక్షణకు

రాత్రివేళ వేట..

కాగజ్‌నగర్ అటవీ డివిజన్ పరిధిలో దట్టమైన అడవులు, ప్రాణహిత, వార్దా నదులు, పెద్దవాగు పరీవాహక ప్రాంతాలు వన్యప్రాణులకు ఆవాసాలుగా ఉన్నాయి. వేటగాళ్లు గుట్టుచప్పుడు కాకుండా వన్యప్రాణులైన పిట్టలు, జింకలు, దుప్పులు, కుందేళ్లు, అడవిపందుల మాంసం విక్రయిస్తున్నారు. పంట చేలు అడవులకు సమీపంలో ఉండడంతో వేటగాళ్లు రాత్రివేళ విద్యుత్ తీగలు అమర్చి వన్యప్రాణులను వేటాడుతున్నారు. రబీ సీజన్‌లో మొక్కజొన్న పంటలపై అడవి పందులు దాడులు చేస్తున్నాయని రైతులు విద్యుత్ తీగలు అమర్చుతున్నారు. దీనినే ఆసరాగా చేసుకొని పలువురు వేటగాళ్లు వన్యప్రాణులకు సైతం విద్యుత్ తీగలు, ఉచ్చులు అమర్చుతున్నారు. వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగలు తగిలి పలువురు మృత్యువాత పడిన సంఘటనలు సైతం ఉన్నాయి.

అటవీశాఖ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో పెద్ద పులుల గోర్లు, చర్మాన్ని గుట్టుచప్పుడు కాకుండా విక్రయించిన సందర్భాలున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపంతోనే కాగజ్‌నగర్ అటవీ ప్రాంతంలో వన్యప్రాణులు మృతి చెందుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. గతేడాది వన్యప్రాణులను వేటాడిన 49 మందిపై 14 కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. వన్యప్రాణులు మృతి చెందిన సందర్భాల్లో వన్యప్రాణుల సంరక్షణపై అటవీశాఖ అధికారులు అవగాహన కల్పించి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. అటవీ చట్టాలపై అధికారులు గ్రామాల్లో అవగాహన కల్పించాలని స్థానికులు పేర్కొంటున్నారు.

అవగాహన కల్పించాలి

అడవుల్లో స్వేచ్ఛగా జీవించే హక్కు వన్యప్రాణులకు ఉంది. వేటగాళ్లు ఉచ్చులు, విద్యుత్ తీగలు అమర్చి వాటిని వేటాడితే కఠిన చర్యలు తీసుకోవాలి. అటవీశాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో ప్రత్యేక క్రీడా పోటీలు నిర్వహించి అటవీ సంరక్షణపై గ్రామాల్లో అవగాహన కల్పించాలి.

- నక్క శంకర్, ఎమ్మార్పీఎస్ నాయకులు, కౌటాల

వేటాడితే కఠిన చర్యలు

వన్యప్రాణులను వేటాడడం నేరం. అడవులు, వన్యప్రాణుల సంరక్షణపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. వన్యప్రాణులతో పంటలకు, పశువులకు నష్టం జరిగితే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలి. ప్రభుత్వం నష్టపోయిన వారికి నష్టపరిహారం అందిస్తుంది. వేటగాళ్లపై కఠిన చర్యలుంటాయి.

- ప్రభాకర్, ఎఫ్‌బీవో, కౌటాల

పాఠశాల పునఃప్రారంభానికి చర్యలు

- ‘సాక్షి’ కథనానికి స్పందించిన ఉన్నతాధికారులు
- సోయంగూడలో పిల్లల వివరాలు సేకరణ

సాక్షి ఎఫెక్ట్..

వాంకిడి: మండలంలోని సోయంగూడ గ్రామంలో నాలుగేళ్లుగా పాఠశాల మూతపడి ఉండటంతో అక్కడి పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలపై ‘అక్షరం దిద్దని ఆదివాసీ బిడ్డలు’ శీర్షికన ‘సాక్షి’ పత్రికలో ఆదివారం కథనం ప్రచురితం కాగా జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. కలెక్టర్ హేమంత్ బోర్కడే ఆదేశాల మేరకు విద్యాశాఖ అధికారులు సోమవారం సోయంగూడ గ్రామాన్ని సందర్శించారు. ఖిరిడి కాంప్లెక్స్ హెచ్‌ఎం ప్రబోద్ కుమార్, సీఆర్పీ విజయ్‌బాబు ఆధ్వర్యంలో గ్రామంలోని 17 మంది బడీడు పిల్లలను గుర్తించి వివరాలు నమోదు చేసుకున్నారు. రెండు రోజుల్లో ఉపాధ్యాయుడిని కేటాయించి పాఠశాలను పునఃప్రారంభిస్తామని వారు తెలిపారు. గ్రామంలో ప్రీ ప్రైమరీ(5 ఏళ్ల లోపు) పిల్లలు 12 మంది ఉన్నట్లు గుర్తించారు. దీంతో గ్రామంలో నూతన అంగన్‌వాడీ కేంద్రం సైతం మంజూరయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు గ్రామస్తులు ‘సాక్షి’కి కృతజ్ఞతలు తెలిపారు.



పిల్లల వివరాలు సేకరిస్తున్న కాంప్లెక్స్ హెచ్‌ఎం

పార్లమెంట్ ఎన్నికలకు ఈవీఎంలు సిద్ధం చేయాలి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్: పార్లమెంట్ ఎన్నికలకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను సిద్ధం చేయాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదామును అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి సోమవారం పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే లోకసభ ఎన్నికల కోసం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతీ ఈవీఎం పని చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మార్కెట్ యార్డులోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. ఆయన వెంట ఎన్నికల విభాగం అధికారులు ఉన్నారు.



ఓటింగ్ యంత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్

సీనియర్ మేట్‌లకు విధిగా పని కల్పించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని వివిధ గ్రామపంచాయతీల పరిధిలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం నిర్వహణలో ఫీల్డ్ అసిస్టెంట్లతో సమానంగా పనులు చేస్తున్న సీనియర్ మేట్‌లకు ఆర్థిక సంవత్సరంలో 365 రోజుల పనిదినాలు కల్పించాలని సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దీపక్ తివారికి సీనియర్ మేట్‌లు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో శంకర్, ఆకాశ్, శ్రీరాం, రాజ్‌కుమార్, సందీప్ ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



పరిచయం చేసుకుంటున్న ఏపీవో భాస్కర్

కెరమెరి: క్రీడలు మానసికోల్లాసం కలిగిస్తాయని ఐటీడీఏ ఏపీవో భాస్కర్, ఎంపీపీ పెందోర్ మోతీరాం, జెడ్పీటీసీ దుర్పతబాయి అన్నారు. సోమవారం మండలంలోని ఇందాపూర్ గ్రామ సమీపంలో పోతురాజు, ధర్మరాజు ఆలయ సమీపంలో నిర్వహించిన కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలు స్నేహ భావాన్ని పెంపొందిస్తాయన్నారు. పురాతన కాలం నుంచి వస్తున్న కబడ్డీపై మక్కువ చూపడం చాలా సంతోషమన్నారు. పోలీస్ రిక్రూట్‌మెంట్‌కు కూడా ఆటలు చాలా ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సిడాం రాజు, సిడాం ధర్ము తదితరులు ఉన్నారు.

రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలి

రెబ్బెన: నేషనల్ హెల్త్ మిషన్‌లో, పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలలో పని చేస్తున్న రెండవ ఏఎన్‌ఎంలను ప్రభుత్వం బేషరతుగా రెగ్యులర్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో పీహెచ్‌సీ వైద్యాధికారి సుజిత్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ రెండవ ఏఎన్‌ఎంలు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్నారని, గత 17 ఏళ్లుగా రెగ్యులర్ కోసం పోరాటాలు చేస్తున్న ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఏఐటీయూసీ అధ్యక్షుడు అరికిల్ల స్వామి, ఉద్యోగులు సునీత, వనిత, మండల్, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్

యోగాలో విద్యార్థుల ప్రతిభ

కౌటాల: బెల్లంపల్లి పట్టణంలో ఆదివారం జరిగిన జాతీయ స్థాయి యోగా పోటీల్లో ప్రతిభ కనబర్చిన మండల కేంద్రానికి చెందిన దాసరి ధార్మిక, కామ్రె జాకిలిని యోగా గురువు దాసరి వినోద్‌గౌడ్ సోమవారం అభినందించారు. యోగా పోటీల్లో ధార్మిక బంగారు పతకం, జాకిలిని కాస్యం సాధించినట్లు ఆయన తెలిపారు.

యోగాలో ప్రతిభ చాటిన తండ్రి, కూతురు

ఆసిఫాబాద్‌రూరల్: యోగా పోటీల్లో తండ్రి, కుతురు సత్తా చాటారు. మండలంలోని బూర్గుడ గ్రామానికి చెందిన వైరాగడే తండ్రి ఆనంద్ రావు, కూతురు దీపికలు బెల్లంపల్లిలో నిర్వహించిన నేషనల్ లెవల్ యోగ చాంపియన్ షిప్ పోటీల్లో సిల్వర్ పతకాలు సాధించారు.



విద్యార్థులతో యోగా గురువు వినోద్‌గౌడ్

సీఐల బదిలీ

ఆసిఫాబాద్: జిల్లాలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ తరుణ్ జోషి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం సీఎస్‌బీ- 1లో విధులు నిర్వర్తిస్తున్న ఎస్.చిట్టిబాబును రెబ్బెన సీఐగా బదిలీ చేయగా.. రెబ్బెన సీఐ నరేందర్‌ను మల్టీజోన్ -1కు రిపోర్టు చేయాలని పేర్కొన్నారు. అలాగే మల్టీజోన్- 1లో వెయిటింగ్‌లో ఉన్న జి.సతీశ్‌ను ఆసిఫాబాద్ సీఐగా బదిలీ చేయగా, ప్రస్తుత ఆసిఫాబాద్ సీఐ బొల్లెపల్లి రాజును మల్టీజోన్- 1కు రిపోర్టు చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు.

పూజలు

కౌటాల: కౌటాల సమీపంలోని గుట్టపై గల కంకలమ్మ దేవి ఆలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సిద్దిపేట జిల్లాలోని పలువురు భక్తులు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం ఆలయంలో భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించారు.

ఘనంగా బోనాల పండుగ

దహెగాం: మండలంలోని హత్తిని గ్రామంలో భీమన్న దేవుని బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలు ఆలయ ఆవరణలో బోనాల నైవేద్యం వండి దేవునికి భక్తి శ్రద్ధలతో సమర్పించారు. ఆలయ ప్రాంగణం ముందు పట్నం వేసి మొక్కులు చెల్లించారు. భక్తులు భారీగా రావడంతో ఆలయ ప్రాంగణం జన సంద్రంగా మారింది. మండలంలోని చిన్న ఐనం గ్రామ సమీపంలోని చిలకయ్య దేవుని వద్ద సైతం బోనాల పండుగ నిర్వహించారు.



ఆలయంలో భీమన్న దేవుడు

భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతులు



పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

జైనూర్: మండలంలోని జామిని గ్రామంలో మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ కారణంగా నీరు వృథాగా పోతుండగా సాక్షిలో ‘రోడ్డుపై పారుతున్న భగీరథ నీరు’ శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి మిషన్ భగీరథ అధికారులు స్పందించి సోమవారం పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టారు.

అడవుల సంరక్షణపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న ఎఫ్ఆర్వో అప్పలకొండ

వాంకిడి: అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని, ప్రతీ ఒక్కరు అటవీ, వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కలిగి ఉండాలని అటవీ రేంజ్ అధికారి అప్పలకొండ అన్నారు. సోమవారం మండలంలోని గోవిందపూర్(గోందాపూర్) గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అటవీ భూములను వ్యవసాయ భూములుగా మార్చకూడదన్నారు. వన్య ప్రాణులను వేటాడేందుకు ఉచ్చులు బిగించడం, విద్యుత్ తీగలు అమర్చడం నేరమని పేర్కొన్నారు. అడవుల సంరక్షణలో ప్రతీ ఒక్కరు బాధ్యతాయుతంగా మెలగాలని సూచించారు. పులులు, చిరుత పులుల కదలికలు గమనిస్తే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. వన్య మృగాల దాడిలో పశువులు మృతి చెందితే నష్ట పరిహారం అందుతుందన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో భగవంత్‌రావు, ఎఫ్‌బీవో శ్రీవిద్య, బీఆర్ఎస్ నాయకుడు దీపక్ ముండె తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లైబ్రరీ సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులు పాఠశాలలోని లైబ్రరీని సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌వో సుభాశ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో లైబ్రరీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సామర్థ్యాలు పెంపునకు, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం లైబ్రరీ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి

వాంకిడి: గావ్ చలో అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పార్టీ మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని నాయకులు, బూత్ స్థాయి కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి, వారికి అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కోశాధికారి అరుణ్ లోయ, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఎలగతి సుచిత్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి సీడర్ల నరేశ్, నాయకులు బంక అరుణ, పైశెట్టి వేణు, పెద్ది ప్రశాంత్, శివ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొత్తపల్లి శ్రీనివాస్

భవన నిర్మాణానికి స్థలం ఇవ్వాలని వినతి

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండల ఆర్‌ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ భవన నిర్మాణానికి కొంత స్థలం ఇవ్వాలని కోరుతూ ఆర్‌ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ యూనియన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఐక్యతతో ముందుకెళ్తున్నామని పేర్కొన్నారు. యూనియన్ అధ్యక్షుడు తౌటం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వంగరి ప్రవీణ్, కోశాధికారి అయ్యూబ్‌ఖాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి మెరాజ్ హుస్సేన్, ముఖ్య సలహాదారులు గజ్జల లక్ష్మణ్, పెర్క మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో గిరిజన విద్యార్థిని



సోంబాయిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని మహిళ గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థిని సోంబాయి నేషనల్ కబడ్డీ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శారద సోమవారం తెలిపారు. కళాశాల ఆవరణలో పీడీ హారికతో కలిసి సోంబాయిని అభినందించారు. ఈ నెల 1 నుంచి 4 వరకు హైదరాబాద్‌లో జరిగే కబడ్డీ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటుందన్నారు.

ఎంపీపీపై అవిశ్వాసం

సిర్పూర్(టి): మండల ఎంపీపీ చునార్కర్ సువర్ణపై అవిశ్వాస తీర్మానాన్ని మండల ఎంపీటీసీలు సోమవారం పట్టణంలోని ఆర్‌డీవో కార్యాలయంలో ఆర్‌డీవో సురేశ్‌కుమార్‌కు అందజేశారు. ఎంపీపీ పనితీరుపై అసంతృప్తితో అవిశ్వాస తీర్మానాన్ని అందజేసినట్లు వారు తెలిపారు. ఎంపీటీసీలు సోహెల్ అహ్మద్, తాహెర బేగం, కారం శైలజ, ఎల్ములే సరిత, మంగిలాల్, ఈర్ల సత్యనారాయణలు ఉన్నారు.

కంటి శస్త్రచికిత్స కోసం తరలింపు

ఆసిఫాబాద్‌అర్బన్: జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావ్ తండ్రి అరిగెల లక్ష్మయ్య జ్ఞాపకార్థం గతంలో మండలంలోని చిర్రకుంట గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. కాగా అందులో శస్త్రచికిత్సలు అవసరమైన 200 మందిని గుర్తించి ప్రత్యేక బస్సులో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఎంపీపీ మల్లికార్జున్‌లు జెండా ఊపి బస్సు ప్రారంభించారు. కార్యక్రమంలో వేణు, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, బీఆర్ఎస్ నాయకులు పెంటయ్య, మల్లేష్ పాల్గొన్నారు.